అంగన్‌వాడీలకు చేరిన కందిపప్పు



అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఎట్టకేలకు అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు చేరింది. నిర్దేశిత గడువులోపు సరఫరా చేయడంలో గుత్తేదారులు వైఫల్యం చెందిన వైనంపై ఈనెల 22న 'కందిపప్పు అరకొరే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వినోద్‌కుమార్, చేతన్ స్పందించి.. వెంటనే సరఫరా చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. దీంతో గుత్తేదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు కిలోల ప్యాకెట్లను సరఫరా చేశారు. అనంత జిల్లాలో మొత్తం 41,217 కిలోల ప్యాకెట్ల కందిపప్పు అందజేయాల్సి ఉంది. బుధవారం నాటికి పదకొండు ప్రాజెక్టులకు గాను తొమ్మిది ప్రాజెక్టుల్లో వందశాతం పంపిణీ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో మొత్తం 12 ప్రాజెక్టులకు 30,965 కిలోల ప్యాకెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు నమోదు చేశారు. ఇక్కడ 12 ప్రాజెక్టుల్లో వంద శాతం ఇచ్చినట్లు నమోదు కావడం విశేషం.

పట్టు రైతులూ.. 'ఈనాడు' మీతోడుగా..

బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమ శాఖ జేడీ (జాయింట్ డైరెక్టర్) దుగ్గిరాల పద్మావతితో ఫోన్‌లో సంప్రదించే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. పట్టు రైతులు కింది ఫోన్ నంబర్లలో సంప్రదించి.. జేడీ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఎప్పుడు: నేడే (గురువారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 98666 99198, 80085 73039

ఈనాడు
శ్రీ సత్యసాయి
గురువారం సెప్టెంబరు 26, 2024



ఉద్యోగుల బదిలీలు
అస్తవ్యస్తం

పలు శాఖల్లో మార్పుచేర్పులకు కసరత్తు చేస్తున్న వైనం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే

క్షేత్ర స్థాయిలో ప్రజాపాలన సాఫీగా సాగడానికి తెదేపా కూటమి ప్రభుత్వం.. సాధారణ బదిలీలకు ఇచ్చిన అవకాశాన్ని కొన్ని శాఖల అధికారులు దుర్వినియోగ పరిచేలా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేయడంపై ప్రజాప్రతినిధులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలతో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం బదిలీలు జరిగినట్లు చెబుతున్నారు. రెవెన్యూ, జడ్పీ, పంచాయతీ, వెలుగు, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, ఇంజినీరింగు.. తదితర శాఖల్లో చేతివాటం ప్రదర్శించారని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి. దాదాపు నెల గడువు ఇచ్చినా ఆఖరులో హడావుడిగా బదిలీలు చేయడం అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారులు, కిందస్థాయి వారితో కుమ్మక్కై వ్యవహారాన్ని నడిపినట్లు విమర్శలు వస్తున్నాయి.

గతనెల 19న మొదలై..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి కొన్ని శాఖలకే పరిమితం చేస్తూ సాధారణ బదిలీలు చేపట్టారు. ఆగస్టు 19 నుంచి 31వ తేదీలోపు బదిలీలను పూర్తి చేయాలని జీవో 75ను జారీ చేశారు. అదే నెలలోనే వరదలు, పింఛన్ల పంపిణీ ఉండటంతో ఈనెల 15వ తేదీ దాకా గడువు పొడిగించారు. తర్వాత విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొనడానికి రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్, విద్యుత్తు.. తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు వెళ్లారు. మూడోసారి మళ్లీ ఈనెల 22 వరకు గడువు ఇచ్చారు. ఇలా రెండు దఫాలు గడువు పొడిగించినా కొన్ని శాఖల జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారీలో జాప్యం చేశారు. గడువు ముగియనున్న సందర్భంలో బదిలీలు జరిపారు. గత వైకాపా పాలనలో అంటకాగిన వారికి జిల్లా కేంద్రానికి సమీపంలోని స్థానాలు కేటాయించడంతో కొందరు ప్రజాప్రతినిదులు తీవ్ర అసంతృప్తి వ్యక్త పరిచారు. మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు.

> జిల్లా పరిషత్తులో గడువు 22లోపు బదిలీలు చేయలేదు. 23 అర్ధరాత్రి దాకా ఉద్యోగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇన్‌ఛార్జి సీఈఓ అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు నిరసన తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ సదరు అధికారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధిలేక అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని వాట్సప్ గ్రూపులో పోస్టు చేయడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. వైకాపాతో అంటకాగిన వారికి ప్రాధాన్య స్థానాలు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ మార్పుచేర్పులు చేస్తున్నట్లు సమాచారం.

✦ రెవెన్యూ శాఖలో ఐదారోజులు సుదీర్ఘ కసరత్తు చేసినా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయలేదు. ఒకే రోజు 120 మందికి బదిలీ ఉత్తర్వు జారీ చేశారు. ఇందులో ఉప తహసీల్దార్లు 73 మంది, సీనియర్ సహాయకులు 33, జూనియర్ సహాయకులు 11, కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురు చొప్పున ఉన్నారు. వీఆర్‌ఓల జాబితాపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. డీటీ, వీఆర్‌ఓ, ఆర్ఐ.. తదితర కేడర్ల విషయంలో కొందరు ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. బదిలీ అయిన వారిని ఎక్కడా చేర్చుకోవద్దు.. రిలీవ్ చేయవద్దంటూ మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. ఆయా కేడర్ల బదిలీల్లో మార్పుచేర్పులపై కసరత్తు సాగుతోంది.

✦ డీఆర్‌డీఏ-వెలుగులో బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయి. డీపీఎంలు నలుగురు, ఏపీఎంలు 32 మంది, సీసీలు 60 మందిని బదిలీ చేశారు. ఉద్యోగుల ఆప్షన్లను పరిగణలోకి తీసుకోలేదు. పనితీరు ఆధారంగా చేయలేదు. నచ్చిన వారికి మంచి స్థానాలు, నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన బదిలీలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఇందులోనూ మళ్లీ మార్పుచేర్పులు సాగుతున్నాయి.

✦ జిల్లా నీటి యాజమాన్య సంస్థలో(డ్వామా) బదిలీల ఊసేలేదు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా యంత్రాంగం ఏమాత్రం దృష్టి సారించలేదు. ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప... ఇప్పటికీ సమాచారం బయటకు పొక్కలేదు. ఇక్కడి పీడీ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కొనసాగుతున్నారు. రెగ్యులర్ పీడీ అక్టోబరు 2 తర్వాత వస్తారని భావిస్తున్నారు. అప్పటిదాకా జరుగుతాయా లేదా అనేదానిపై నీలినీడలు కమ్ముకున్నాయి.



పుట్టపర్తి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులను బృందాలుగా నియమించి సంరక్షిస్తున్నారు. బెండకాయ, టమాటా, మిరప, వంకాయ, కొత్తిమీర, మెంతి, గోంగూర పండిస్తున్నారు. ఇక్కడ వంటావార్పుకు వినియోగిస్తున్నారు.



కదిరిలోని కస్తూర్బా విద్యాలయంలో టమాటా, వంకాయ, మిరప చెట్లు పూతకు వచ్చాయి. పౌష్టికాహారానికి అవసరమైన వాటిని తామే పండిస్తున్నామన్న ఆనందం విద్యార్థుల్లో కనిపిస్తోంది.

ఆరోగ్యానికి పౌష్టికాహార పెరటి!


ప్రభుత్వ బడుల ఆవరణలో కూరగాయల సాగు

కదిరి, పుట్టపర్తి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే

ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాలు కలిగిన ఆహారంతో ఆరోగ్యంగా ఉండగలం. రసాయనేతర సేంద్రియ సాగు ఆహార ఉత్పత్తులతో మరింత ప్రయోజనకరం. అందుకే ప్రభుత్వ బడుల్లోని ఆవరణాల్లో కూరగాయల సాగుతో ఆరోగ్యం, ఆదాయం సమకూరేలా ప్రభుత్వం పౌష్టికాహార పెరటి తోట సాగుకు శ్రీకారం చుట్టింది. తద్వారా బహుళ ప్రయోజనాలకు అవకాశం ఉంది. ప్రభుత్వమే వంకాయ, మిరప, టమాటా, బెండకాయ, గోంగూర తదితర కాయగూరల విత్తనాలను సరఫరా చేస్తోంది. జులై చివరి వారంలో ఎంపిక చేసిన 120 బడుల్లో సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలుచోట్ల ఆకుకూరలు, బెండకాయ దిగుబడులతో కూరలు వండుతున్నారు. తద్వారా ఖర్చు తగ్గింది. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల బృందాలు పెరటి తోటలను సంరక్షిస్తుంటాయి. ఒక్కో రకాన్ని ఒక్కో తరగతి విద్యార్థులకు అప్పగించారు. తద్వారా పిల్లలకు బాధ్యతలతోపాటు పోషకాహారం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకుంటారు.

అవకాశం ఉన్న చోట్ల సాగు.. - మీనాక్షి, విద్యాశాఖాధికారిణి, శ్రీసత్యసాయి జిల్లా

జిల్లాలోని 120 బడుల్లో పెరటితోట సాగు చేస్తున్నారు. అవకాశాలు ఉన్న పాఠశాలల్లో సాగు చేయిస్తాం. అవసరమైన విత్తనాలను అందిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుంది.



ధర్మవరం మండలం వసంతపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పర్యవేక్షణలో వస్తున్న దిగుబడులను మధ్యాహ్న భోజనం తయారీకి వినియోగిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడని ఉత్పత్తులు కావటంతో ఆరోగ్యపరంగా మేలు కలుగుతోందని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరమగ్గాలతో కార్మికుల ఉపాధికి దెబ్బ



కార్మికుడితో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, నాగేశ్వరరావు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మరమగ్గాలపై చేనేత రకాలు తయారు చేస్తూ చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని గీతానగర్‌లో చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను ధర్మవరంలో మరమగ్గాల నిర్వాహకులు అతిక్రమిస్తున్నారని తెలిపారు. చేనేత మగ్గాల పరిరక్షణ, కార్మికుల ఉపాధి కోసం ఐక్య చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. వేల్పుమడుగు వద్ద జె.ఆర్.శిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద గురువారం ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. చేనేత సంఘాలు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలాజీ, వెంకటనారాయణ, ఎస్.హెచ్.బాషా, జి.వి.రమణ, మోహన్, వెంకటస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం రేంజ్ పరిధిలోని పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షిముషీ ఉత్వర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న పి.సత్యబాబును పుట్లూరు సర్కిల్‌కు, అక్కడ పనిచేస్తున్న ఆర్.జి. సుబ్రహ్మణ్యం అనంతపురం వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న టి.నాగమణిని అనంతపురం సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న షేక్ జాకీర్‌ను అనంతపురం సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సి.గోపినాథ్‌రెడ్డిని పుట్టపర్తి మహిళా పోలీస్‌స్టేషన్‌కు నియమించారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న డి.మునిస్వామిని పుత్తూరు రూరల్ సర్కిల్‌కు, ఇక్కడి సీఐ యం. భాస్కర్‌నాయక్‌ను తిరుపతి వీఆర్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న వి.చిన్నపెద్దయ్యను శ్రీసిటీ పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న పి.శ్రీరాములును తిరుపతి డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు, తిరుపతి ఈస్ట్‌లో చేస్తున్న మహేశ్వరరెడ్డిని తిరుపతి వీఆర్‌కు పంపారు. తిరుపతి డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీరాముడుని తిరుమల టూటౌన్‌కు, అక్కడి సీఐ ఎ.సత్యనారాయణను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. అన్నమయ్య మహిళా పీఎస్‌లో పనిచేసే కె.లక్ష్మీనారాయణను చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు సర్కిల్‌కు, వీఆర్‌లో ఉన్న ఇ.కృష్ణమోహన్‌ను పూతలపట్టు యూపీఎస్‌కు, పూతలపట్టు సీఐ ఎం.సుదర్శనప్రసాద్‌ను చిత్తూరు వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచి మంత్రి సత్యకుమార్ పర్యటన

ధర్మవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం నుంచి ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడిమర్రిలో నిర్వహించే మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరం ఎన్డీయే కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 27న ఉదయం 10 గంటలకు ఎన్డీయే కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమావేశం, 28న ఉదయం 9 గంటలకు పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పురపాలక అధికారులతో సమీక్షాసమావేశం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు పోతులనాగేపల్లి కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో పాల్గొంటారు. 29న ఉదయం 9.30 గంటలకు ధర్మవరం విష్ణుప్రియ రెసిడెన్సీలో ఐఎంఏ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయ సిబ్బంది వివరించారు.





మహావృక్షం నీడలో కొలువుదీరిన తిమ్మమాంబ

ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సౌరభం
తిమ్మమ్మ మర్రిమాను

విస్తరించిన మర్రిమాను కొమ్మలు, ఊడలు



చారిత్రక, ఆధ్యాత్మిక, వైజ్ఞానికపరంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం ఎన్‌పీ కుంట మండలంలో తిమ్మమ్మ మర్రిమాను ఎంతో ప్రసిద్ధి. మర్రిమాను వయసు 500 ఏళ్లు. సుమారు 8 ఎకరాల్లో విస్తరించి ఉంది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. చెట్లకొమ్మలు, ఊడలు విస్తరించిన ఈ ప్రాంతంలో స్మారకం, దేవాలయం ఉంది. మహాశివరాత్రికి ఇక్కడ పెద్ద స్థాయిలో ఉత్సవాలు జరుగుతాయి. వివాహం, సంతానం కోసం తిమ్మమాంబ ఆలయానికి విచ్చేసి ముడుపులు కడతారు. పెద్ద చెట్టు ఉన్నప్పటికీ ఒక పక్షి గూడు ఉండకపోవటం మరో విశేషం. ఐదేళ్లుగా వైకాపా పాలనలో కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో మర్రిమాను ప్రాంతం ప్రాచుర్యాన్ని కోల్పోయింది. ఈ మహా వృక్షంను దర్శించుకునేందుకు తగిన రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే నిత్యం పర్యాటకుల రాకకు మార్గం సుగమం అవుతుంది. కదిరి లక్ష్మీనరసింహస్వామి వద్దకు వచ్చే భక్తులకు ఇక్కడి విశేషాలను వివరించేలా చేస్తే నిత్యం పర్యాటకులు పోటెత్తడం ఖాయం.

- ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, కదిరి

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించండి

వినియోగదారుల న్యాయస్థానం తీర్పు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: వైద్యసేవల్లో జరిగిన నిర్లక్ష్యానికి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం.శ్రీలత బుధవారం తీర్పునిచ్చారు. అనంతపురానికి చెందిన అనిల్‌కుమార్ (38) వాంతులు రావడంతో స్థానిక వైద్యుల సలహా మేరకు బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రిలో చేరాడు. రెండు రోజుల పరీక్షల అనంతరం వైద్యులు అతనికి మూత్ర పిండాల సమస్య ఉందని, శస్త్రచికిత్స చేయాలని సూచించారు. రోగి అంగీకారంతో శస్త్రచికిత్స చేసి, స్టంట్ వేశారు. ఐదు రోజుల తర్వాత రోగిని ఇంటికి పంపుతూ 4 వారాల తర్వాత స్టంట్ తొలగించడానికి ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ మేరకు 2018 డిసెంబరు 12న రోగి భార్యతోపాటు ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి 28న రావాలని సూచించారు. 28న శస్త్రచికిత్స చేసి స్టంట్ తొలగించామని చెప్పారు. రోగి ఆరోగ్యపరిస్థితి కుదుట పడిందని చెప్పారు. రెండేళ్ల తర్వాత 2020 జులై 1న రోగికి కాలులో నొప్పి రావడంతో అదే ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి తమ ఆసుపత్రిని కొవిడ్‌కు కేటాయించారని, తమకు అనుబంధంగా ఉన్న మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి స్టంట్ పొరపాటున మూత్రపిండంలో ఉండిపోయిందని తేల్చారు. ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా నిర్ధారించి, శస్త్రచికిత్స చేసి తొలగించారు. అనంతరం రోగి వాంతులతో బాధపడుతూ 2020 డిసెంబరు 21న మృతి చెందాడు. ఇదంతా వైద్యుల నిర్లక్ష్యమేనని ఆసుపత్రికి బాధితులు నోటీసులు పంపారు. ఆసుపత్రి వర్గాల నుంచి ఎలాంటి స్పందించలేదు. మృతుడి భార్య, పిల్లలు, తండ్రి కలిసి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం కమిషన్ ఇందులో ఇద్దరు వైద్యులను బాధ్యులు చేస్తూ సేవాలోపానికి రూ.10 లక్షలు, మనోవేదనకు రూ.20 వేలు, ఖర్చులకు రూ.5వేలు చెల్లించాలని ఆదేశించింది.

24 మండలాల్లో వర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కదిరి 32.8 మి.మీ., అత్యల్పం ధర్మవరం 1.6 మి.మీ. వర్షం పడింది. సోమందేపల్లి 32.2, ఓడీసీ 31.4, బుక్కపట్నం 29.6, గోరంట్ల 25.8, కొత్తచెరువు 22.0, అమడగూరు 18.4, గాండ్లపెంట 18.2, నల్లమాడ 17.4, పుట్టపర్తి 17.4, అమరాపురం 17.2, రొద్దం 16.4, తలుపుల 16.2, ఎన్‌పీకుంట 15.0, రొళ్ల 11.4, తనకల్లు 10.6, పెనుకొండ 10.0, చిలమత్తూరు 8.6, నల్లచెరువు 7.4, పరిగి 7.2, ముదిగుబ్బ 6.6, మడకశిర 3.6, హిందూపురం 2.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

నేరాల నియంత్రణకు సమన్వయమే ముఖ్యం



సీఐ సునీతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న, అదనపు ఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగేలా చూడాలని ఎస్పీ రత్న ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారీగా నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, పోక్సో, గంజాయి, చోరీలు, ఎన్‌డీపీఎస్, గ్యాంబ్లింగ్, రోడ్డు ప్రమాదాలు పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్షించారు. పోలీసు స్టేషన్లవారీగా కేసుల పెండింగ్‌కు కారణాలపై ఆరా తీశారు. రౌడీషీటర్ల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్‌నేరాలు, మహిళల భద్రత మాదకద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కేసుల ఛేదింపులో ప్రతిభ కనబరచిన 20 మంది సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆళ్ల శ్రీనివాసులు, డీఎస్పీలు శ్రీనివాసరావు, శివనారాయణ స్వామి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

★ పుట్టపర్తి, కొత్తచెరువు సీఐలు సునీత, ఇందిర, ఎస్ఐలు శ్రీధర్, కృష్ణవేణి, ధరణిబాబు, ఏఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుళ్లు తిరుమలరెడ్డి, రామకృష్ణ, రామయ్య, సోమశేఖర్, సౌభాగ్య, మధుసూదనరావు, హర్షవర్ధన్, కొండారెడ్డి, విజయ్ కుమార్, జనార్దన్, సౌందర్య, నారాయణమ్మ, హోంగార్డు నరసింహులు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం

జిల్లావ్యాప్తంగా చౌక దుకాణాల పెంపునకు ప్రతిపాదనలు

జిల్లాలో మొత్తం చౌక దుకాణాలు	1,367
బియ్యం కార్డులు	5,83,963

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అవసరం ఉన్నచోట రేషన్ దుకాణాల సంఖ్య పెంచాలని సంకల్పించింది. ఈ మేరకు జిల్లాలో 287 చౌక దుకాణాలు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ప్రతినెలా 5,83,963 కార్డులకు 1,367 చౌక దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరకులు అందజేస్తున్నారు. వైకాపా హయాంలో ఇంటికే సరకులు అందిస్తామని ఎండీయూ వ్యవస్థను ప్రవేశపెట్టినా ప్రభుత్వానికి ఆర్థిక భారమే తప్ప లబ్ధిదారులకు ఎలాంటి ఉపయోగం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తరుణంలో అలాంటి వ్యవస్థకు స్వప్తి పలికి డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది.

కొత్తగా 287 దుకాణాలకు అవకాశం

శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా కార్డులు, సుదూర ప్రాంతాల్లో ఉన్న కార్డుదారులకు నూతన చౌకదుకాణాల ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. కాస్త దూరంగా ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా సరకులు ఎలా పంపిణీ చేయాలో కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సమగ్ర సమాచారం రాగానే హేతుబద్ధీకరణ జిల్లా పౌరసరఫరాలశాఖ కార్డుదారులకు అనుగుణంగా కొత్త దుకాణాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు.

పట్టణంలో 400 నుంచి 500 కార్డులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చౌక దుకాణాల్లో 400 నుంచి 450 వరకు కార్డులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ దిశగా చౌక దుకాణాల క్రమద్ధీకరణకు కసరత్తు చేపట్టారు. అత్యధికంగా ధర్మవరం పట్టణంలో 38, హిందూపురంలో 40 దుకాణాలు నూతనంగా ఏర్పాటు కానున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు

- వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అనుగుణంగా నూతన చౌకదుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

పామిడిలో యథేచ్ఛగా ఇసుక రవాణా

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పెన్నాపరివాహక ప్రాంతం ఇసుక అక్రమ రవాణాదారులకు వరంలా మారింది. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. కొన్ని రోజుల కిందట ఇసుకను తరలిస్తున్న ఎడ్లబండ్లపై అధికారులు జరిమానా విధించడంతో ఇసుక అక్రమ రవాణా విషయం చర్చనీయాంశమైంది. కొందరు ట్రాక్టర్లతో, మరి కొందరు ట్రిప్పర్లతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెన్నాపరివాహక ప్రాంతంలోని ఓ వ్యక్తి తన పట్టా భూమిలో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పామిడి సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా జరుగకుండా నిఘా ఉంచాం. పోలీసుల పర్యవేక్షణలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పట్టపగలే ట్రిప్పర్‌లో ఇసుక నింపుతున్నారిలా..

దబ్బచిక్కుడు.. రైతు కంట నీరు

- ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి
- అమాంతంగా పడిపోయిన ధర

పెద్దపప్పూరు, తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : గత ఏడాది కాసుల వర్షం కురిపించిన దబ్బచిక్కుడు పంట ప్రస్తుతం రైతు కంట నీరు పెట్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇక్కడ పంట సాగవుతుంది. ఆరు గాలం శ్రమించి పంట సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది కిలో రూ. 60 నుంచి రూ. 70 వరకు పలికిన ధర ప్రస్తుతం కనీస గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

దిగుబడి ఉన్నా..

తాడిపత్రి నియోజవర్గ వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగులో ఉంది. ఎకరాకు రూ. 40 వేలు పెట్టుబడి పెట్టి బిందు సేద్యం ఆధారంగా సాగు చేపట్టారు. గత నెల నుంచి పంట చేతికి వస్తోంది. దబ్బచిక్కుడు పంటకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై మార్కెట్‌లో మాత్రమే మంచి డిమాండ్ ఉంటుంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక రైతులు నేరుగా పంటను చెన్నై మార్కెట్‌కు తరలిస్తున్నారు. కిలో రూ. 10 మాత్రమే పలుకుతుండడంతో రవాణా ఖర్చులు, మార్కెట్ కమీషన్, కూలీల ఖర్చులు పోను పైసా చేతికి దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో పంటను పొలంలో వదిలేయలేక పెట్టుబడులు రాక పోయినా మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.



పెద్దపప్పూరు: సాగులో ఉన్న దబ్బచిక్కుడు పంట



మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

చేతి నుంచే కూలీలకు చెల్లిస్తున్నా



రెండెకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగు చేశా. రూ. 80 వేల వరకు పెట్టుబడి వచ్చింది. నెల రోజుల నుంచి పంట చేతికి వస్తోంది. కిలో ధర రూ. 10 వరకే ఉంది. కూలీలకు చేతి నుంచి చెల్లిస్తున్నా. అధికారులు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి. - గౌస్, రైతు, పెద్దపప్పూరు

అధికారులతో చర్చించి న్యాయం చేస్తాం

తమిళనాడు రాష్ట్రంలో మాత్రమే దబ్బచిక్కుడు పంటను ఎక్కువగా వినియోగిస్తారు. స్థానికంగా వినియోగించేవారు లేకపోవడంతో రైతులంతా చెన్నై మార్కెట్‌కు దిగుబడిని తరలిస్తున్నారు. ఒకే మార్కెట్‌కు పంట అధికంగా పోవడంతో ధరలు తగ్గాయి. తమిళనాడు పరిస్థితులు తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం. -ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి

కియాలో ఉద్యోగ అవకాశాలు కల్పించండి



కియా ప్రతినిధులతో చర్చిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: కియా కార్ల పరిశ్రమలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శన రావు విజ్ఞప్తి చేశారు. కియా ప్రతినిధులు హాంగ్‌సంగ్ పార్క్, హంగుకిమ్, శ్రీహాన్, ఉమాశంకర్ పట్నాయక్, రమేష్‌బాబు, విజయపాయ్ బుధవారం జేఎన్‌టీయూను సందర్శించారు. సీమెన్స్ ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం ఇన్‌ఛార్జితో సమావేశమయ్యారు. వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కియా పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కూడా ఇవ్వాలన్నారు. అధ్యాపకులు, ఆచార్యులు, విద్యార్థులు కియా పరిశ్రమ సందర్శించడానికి అవకాశాలు కల్పించాలన్నారు. జేఎన్‌టీయూ, కియా పరస్పర సహకారంతో పనిచేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల శాఖలో బదిలీలు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా పరిశ్రమల శాఖలో బదిలీలు జరిగాయి. అనంత జీఎం నాగరాజారావును అనకాపల్లికి, అక్కడి పని చేస్తున్న జి.ఎం.శ్రీధర్‌ను అనంత జిల్లా పరిశ్రమల అధికారిగా బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా డీఐసీ చాంద్‌బాషాను కడపకు, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న జె.నాగరాజును శ్రీసత్యసాయికి బదిలీ చేశారు. వీరందరూ అక్టోబరు తొలి వారంలో రిలీవ్ అయి... కొత్త స్థానాల్లో చేరే అవకాశం ఉంది. ఇదే క్రమంలో అనంత జిల్లా పరిశ్రమల కార్యాలయ పర్యవేక్షకుడు వి.మునినాయుడుని చిత్తూరుకు బదిలీ చేయగా.. కర్నూలు నుంచి డి.రామాంజినమ్మను అనంత కార్యాలయానికి బదిలీ చేశారు. అనంత డీఐసీలోని ఐపీఓలు వి.సుజనను నంద్యాలకు, జేపీ దుర్గేష్‌ను శ్రీసత్యసాయికి బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లోకి నంద్యాలలో పని చేస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాలో పని చేస్తున్న భువనేశ్వరి, వి.నిశాంత్‌లను అనంత డీఐసీకి రానున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

తలుపుల, న్యూస్‌టుడే: వేపమానిపేట పంచాయతీ గంజివారిపల్లి ఎస్సీ కాలనీలో గంగన్నకు చెందిన 13 గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఎప్పటిలానే గొర్రెలు మేపుకొని మంగళవారం సాయంత్రం రేకులషెడ్‌లో తోలారు. ఆ రాత్రి మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. ఆ సమయంలో రేకుల ద్వారా విద్యుదాఘాతానికి గురై ఒక్కసారి అక్కడికక్కడే మృతిచెందాయి. దాదాపు రూ. 1.95 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. ప్రభుత్వం స్పందించి గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

బాధిత రైతు కుటుంబానికి రూ.లక్ష పరిహారం

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని బొడ్రాయి వీధిలో నివాసమంటున్న రైతు సూర్యనారాయణ కలెక్టరేట్ కార్యాలయంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ రైతు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పామిడి తహసీల్దారు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున రూ.లక్ష చెక్కును అందజేశారు. భూమి ఆధారాలు పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యుల పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పామిడి తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, గార్లదిన్నె తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

పంటల బీమా ప్రకటించాలని నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గడిచిన ఖరీఫ్, రబీ పంటలకు బీమాను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ముందు నిరసన తెలిపారు. తొలుత అనంత నగరంలో ర్యాలీ చేశారు. రెండు రోజుల క్రితం మృతి చెందిన పామిడి సూర్యనారాయణ చిత్రపటాన్ని చేతబూని నిరసనలో పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు తరిమెల నాగరాజు, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బాల రంగయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గత ఖరీఫ్, రబీ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి ఏమాత్రం పరిహారం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం సత్వరమే బీమా ప్రకటించాలని కోరారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా వేరుసెనగ, పప్పు శెనగ, మిరప, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, ప్రొద్దు తిరుగుడు.. వంటి పంటలు దిగుబడి రాలేదన్నారు. 2023లో ఖరీఫ్‌లో 18, రబీలో 14 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించారని గుర్తు చేశారు. సత్వరమే తగిన సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత రైతు సూర్యనారాయణ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. దీనికి బాధ్యులైన వీఆర్‌ఓ మధును సస్పెండ్ చేయాలన్నారు. ఆ తర్వాత డీఆర్‌ఓకు వినతి అందజేశారు. ఈ నిరసనలో రైతు సంఘం నాయకులు శివారెడ్డి, విరుపాక్షి, రాజారాం, నల్లప్ప, పోతులయ్య, కుళ్లాయప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ఆక్రమించిన భూముల్ని తిరిగి ఇప్పిస్తాం: సునీత

రూ. 3.60 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే సోదరుడు, ఆయన అనుచరగణం భూ దందాలు చేసి ఎంతో మంది పేద ప్రజల భూములు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆక్షేపించారు. సీకేపల్లి మండలం ప్యాదిండి, ఎన్‌ఎస్ గేట్, సీకేపల్లి, హర్యాన్‌చెరువు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి రూ. 3.60 కోట్లతో నిర్మించనున్న సీసీ దారుల నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. సీకేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ సభలో పాల్గొని ప్రసంగించారు. వైకాపా నాయకులు లాక్కున్న భూములను ఆర్డీఓతో చర్చించి సంబంధిత రైతులకు తప్పకుండా ఇప్పిస్తామన్నారు. వైకాపా ఐదేళ్ల కాలంలో చేయలేని పనులు 100 రోజుల్లోనే చేసి చూపించామన్నారు. పింఛన్ల పెంచామని, అన్న కాంటీన్లు ప్రారంభించామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామన్నారు. గతంలో ఇక్కడ వీఆర్వోగా పనిచేసిన మహేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి, సీఐగా పనిచేసిన వ్యక్తి పేదలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, వారి చేసిన అక్రమాలను వెలికి తీస్తామన్నారు. త్వరలోనే పేదలందరికీ మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి, రూ.4 లక్షలతో గృహ నిర్మాణాలు చేపడతామన్నారు. ఈఓఆర్డీ అశోక్‌నాయక్, తెదేపా సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి, మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మాజీ ఎంపీపీ అమరేంద్ర పాల్గొన్నారు.



సీసీదారుల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



ఎంపికైన అండర్-17 ఫుట్‌బాల్ బాలికల జట్టు



బాలుర జట్టు

ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలబాలికల జట్లను బుధవారం ఎంపిక చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను తుది జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 28 ఉంచి పల్నాడు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయి. ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి పాఠశాల క్రీడల సమాఖ్య అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కార్యదర్శులు బి.సుగుణమ్మ, మొరార్జీ యాదవ్‌లు అతిథులుగా హాజరయ్యారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా లోకనాథ్, ప్రకాశ్‌రెడ్డి, దాదా ఖలందర్‌లు వ్యవహరించారు.

జట్ల వివరాలు ఇలా...

బాలికల జట్టు: ప్రణతి, వర్ష, అఖి, అక్షిత, హాసిని, శిల్పా, యామిని, స్వాతి, హర్షవల్లి రూప, మన్విత, పూజిత, రమ్య, పూజిత, భార్గవి, యశస్విని, భవ్యశ్రీ. **బాలుర జట్టు:** సుధీర్, తన్విత్, పవన్, జశ్వంత్, శ్రీహరి, యశ్వంత్‌కుమార్, ఆదిత్య, హేమంత్, నవీన్, రితిక్‌రెడ్డి, కేసీ యోగేష్, పునీత్‌కుమార్, బి.ధనూష్‌కుమార్.

రథం ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ పాత్రపై విచారణ జరపాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు మండలం హనకనహాళ్‌లో శ్రీరాముడి రథం దహనం కేసులో హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్పీ జగదీశ్‌ను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీరాముడి రథం దహనం కేసులో బోడిమల్ల ఈశ్వరరెడ్డికి సమీప బంధువు హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఖచ్చితంగా ఉందని తనకు, గ్రామస్థులకు అనుమానం ఉందన్నారు. రథానికి నిప్పుపెట్టడం ఒక వ్యక్తితో కాదని, ఇంకా నలుగురు ఉంటారనే అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారని, ఆ కోణంలో దర్యాప్తు చేపట్టాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి మంగళవారం ఎందుకు వచ్చారో విచారణ జరిపించాలన్నారు. రఘునాథరెడ్డి కణేకల్లులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసే సమయంలో వైకాపా నాయకులకు కొమ్ము కాసి, తెదేపా నాయకులపై అనేక తప్పుడు కేసులు పెట్టి వేధించాడన్నారు. ఒక వాలంటీర్ పాత్రపై అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా నాగమద్దయ్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులను బదిలీ చేసింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు డిప్యూటీ కమిషనర్‌గా పి.నాగమద్దయ్యను నియమించారు. ఈయన సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీగా విజయవాడ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. అసిస్టెంట్ కమిషనర్‌గా విజయవాడలోని డిస్టిలరీస్ ఏసీగా పనిచేస్తున్న జి. మునిస్వామి రానున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నంద్యాల సెబ్‌లో పనిచేస్తున్న బి.రామమోహన్‌రెడ్డిని నియమించారు.

సాంకేతిక సాగుతో ఖర్చులు తగ్గించుకోవచ్చు

కుందుర్పి, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ రైతులు పంటల సాగుతో ఖర్చులు తగ్గించుకోవచ్చని జాతీయ వ్యవసాయ పరిశోధన విద్యాశాఖ మాజీ కార్యదర్శి, ఐసీఏం మాజీ డైరెక్టర్ జనరల్ పంజాబ్ సింగ్ పేర్కొన్నారు. ఐసీఏఆర్, సీఆర్‌ఐడీఏ ప్రాజెక్ట్ సంస్థ బృంద సభ్యులు బుధవారం మండలంలోని తమ్మయ్యదొడ్డిలో ప్రకృతి వ్యవసాయ పంటలు, నీటి కుంటలు, ఉపకరణాలను పరిశీలించారు. ఏఎఫ్ ఎకాలజీ సంస్థ సహకారంతో రైతులు సాగుచేసిన వ్యవసాయ పద్ధతులను బృంద సభ్యులకు వివరించారు. కరవు పరిస్థితులకు తట్టుకునేలా విత్తనాలు వాడాలన్నారు. వర్షాలు రానప్పుడు ప్రత్యామ్నాయంగా రక్షక తడులతో అందించే విధానంపై తెలిపారు. ఇతర చోట్ల పంటల సాగు వివరాలను చిత్రతెరల ద్వారా చూపించారు. రేకులకుంట వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్తలు విజయ్, శంకర్‌బాబు, ఆంగ్రియా డైరెక్టర్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, నేషనల్ కోఆర్డినేటర్ రామసుందరం, ఏఎఫ్ ఎకాలజీ ముఖ్య అధికారి మురళీకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నీటి కుంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కంటైనర్‌లో మంటలు



పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని పులేకమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఎలక్ట్రానిక్స్ స్క్రాప్‌తో వెళుతున్న కంటైనర్‌లో బుధవారం మంటలు వ్యాపించాయి. డ్రైవర్ వివరాల మేరకు.. తమిళనాడు నుంచి దిల్లీకి ఎలక్ట్రానిక్స్ స్క్రాప్‌తో వెళుతుండగా కంటైనర్‌లో పొగలు వచ్చాయి. వెనక వచ్చిన ఓ లారీ డ్రైవర్ గమనించి చెప్పడంతో వాహనాన్ని ఆపేశారు. అందులో ఉన్న పాత ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ స్క్రాప్‌కు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. రూ. 80 వేలు విలువచేసే సామగ్రి దగ్ధమైనట్లు ఆశాఖ అధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

అనంతపురం(లీగల్): జిల్లా కేంద్రంలో జరిగిన మొలక దేవేంద్ర హత్య కేసులో నిందితుడు లక్ష్మీనారాయణకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏడో అదనపు సెషన్స్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి టి.హరిత బుధవారం తీర్పు వెలువరించారు. రుద్రంపేటకు చెందిన మొలక దేవేంద్ర, అతని భార్య లక్ష్మీదేవిలు సవీరా ఆసుపత్రిలో పని చేస్తూ జీవనం సాగించేవారు. వీరి ఇంటి పక్కనే లక్ష్మీనారాయణ నివాసం ఉంటున్నాడు. గతంలో దేవేంద్ర.. లక్ష్మీనారాయణ భార్యను దుర్భాషలాడాడు. అది మనసులో పెట్టుకొని 2021 నవంబరు 11న దేవేంద్ర, అతని భార్య లక్ష్మీదేవి ఇంట్లో ఉండగా లక్ష్మీనారాయణ వారి ఇంట్లోకి ప్రవేశించి దేవేంద్రను కింద పడేసి కొట్టసాగాడు. అదే క్రమంలో భార్య అడ్డు వస్తే తోసేశాడు. పక్కనే ఉన్న పునాదిరాయిని తలపై వేసి దేవేంద్రను చంపేశాడు. వీధిలో ఉన్నవారు అప్రమత్తమై అక్కడికి వచ్చే సరికి పారిపోయాడు. అప్పటి నాలుగో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి అభియోగ పత్రాలను కోర్టుకు అందజేశారు. కోర్టు పది మంది సాక్షులను విచారించింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజ బాబు వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. సీఐ కత్తి శ్రీనివాసులు, కోర్టు మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, సునీల్ కుమార్‌లను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

భార్యను చితకబాది.. భర్త ఆత్మహత్య

గుత్తి, న్యూస్‌టుడే : తనకు దూరంగా ఉంటున్న ఓ భార్యపై భర్త కర్రతో విచక్షణారహితంగా కొట్టి.. తాను ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్(40) యాడికి మండలానికి చెందిన సుమలతతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. కొంతకాలం తరువాత ఇద్దరి మధ్య విభేదాలొచ్చాయి. ఈక్రమంలో భార్య భర్తకు దూరంగా యాడికిలో ఉంటోంది. భర్త తల్లికి ఆరోగ్యం బాగలేకపోవడంతో చూసేందుకు శనివారం వచ్చింది. దీంతో ఆగ్రహించిన గోపాల్ ఆమె తలపై కర్రతో బాదాడు. ఈఘటనతో ఆమె కోమాలోకి వెళ్లింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చనిపోతే తనకు ఇబ్బందులు తప్పవని భావించిన భర్త బుధవారం గుత్తిశివారులోని తురకపల్లి రైల్వే వంతెన వద్ద రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గుత్తి ఆసుపత్రికి తరలించి పంచనామా చేశారు.

కేతిరెడ్డి వాహన డ్రైవర్ అరెస్టు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్‌జైలు కూడలి వద్ద ఈ నెల 23న భాజపా కార్యకర్త ప్రతాప్‌రెడ్డిని కారుతో ఢీకొట్టిన కేసులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహన డ్రైవర్ రామాంజనేయులును బుధవారం 1వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పెనుకొండ కోర్టులో రామాంజనేయులును పోలీసులు హాజరుపరిచారు. కోర్టు అతడికి రిమాండ్‌కు ఆదేశించింది.

వైద్యసేవల్లో జాప్యంపై విచారణ

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మాతాశిశు కేంద్రంలో గర్భంలోనే ఇద్దరు శిశువులు మృతి చెందిన ఘటన సంచలనం కలిగించింది. దీనిపై గత ఆగస్టు 28న ఈనాడులో ‘పురం.. వైద్యసేవల్లో జాప్యం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. విచారణకు అధికారిణి స్వప్నసుందరిని నియమించారు. ఆమె బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో దస్త్రాలు పరిశీలించారు. అనంతరం లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన బాధితులు, వైద్యులను విచారించారు. గురువారం పరిగి మండలం చిన్నపల్లికి చెందిన బాధితులను విచారించనున్నారు. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పండిట్ దీన్‌దయాళ్ ఆశయాలు కొనసాగిద్దాం

జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగిద్దామని భాజపా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం హిందూపురం, లేపాక్షి, మడకశిర, పెనుకొండలలో ఆయన జయంతి నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే బృందం**



మడకశిరలో నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

గోరంట్ల, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గోరంట్లకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. హర్షిత, శ్రీనవ్య, ఉజ్వల, జహీత, పావని ప్రదర్శనతో మన్ననలు పొందారు. వీరందరూ స్థానిక శశికళ టీచర్ వద్ద శిక్షణ పొందుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో అవకాశం వచ్చినట్లు చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిన్నారులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేసినట్లు వారు వివరించారు.



ధ్రువపత్రాలు అందుకున్న గోరంట్ల చిన్నారులు

కార్మికులకు భద్రత ఏదీ?

● ప్రమాదాలు జరుగుతున్నా పట్టని యాజమాన్యాలు ● పరిశ్రమల్లో దయనీయం



తూముకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో బాయిలర్ చుట్టూ పెరిగిన చెట్లు

● పారిశ్రామిక వాడలు	: తూముకుంట, గొల్లాపురం
● పరిశ్రమలు	: స్టీల్ 19, ఫార్మా 6
● పని చేస్తున్న కార్మికులు స్టీల్	: 5,000 ఫార్మా: 1,200
● పదేళ్లలో ప్రమాద ఘటనలు	: 25

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: తూముకుంట, గొల్లాపురం పారిశ్రామిక వాడలో స్టీల్, ఫార్మా కంపెనీలు రెడ్‌జోన్ పరిధిలో ఉన్నాయి. వాటి యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. దాంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంతో మంది కార్మికులు గాయాల పాలవుతున్నారు. ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు 20 నుంచి 25 ప్రమాదాలు జరుగగా అత్యధికంగా స్టీల్ పరిశ్రమల్లో చోటు చేసుకోవటం గమనార్హం. స్టీల్ పరిశ్రమల్లో ఇనుము కరిగించేందుకు బాయిలర్‌లో దాదాపు 1,500 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటోంది. ఇక్కడే కార్మికులు అధికంగా పని చేస్తుంటారు. ఈ ప్రాంతంలో తగిన భద్రత పాటించక కార్మికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫార్మా కంపెనీల్లో ఘన పదార్థాలను పిండి పదార్థంగా మార్చటానికి రియాక్టర్లను వినియోగిస్తారు. ఇవి అధిక ఒత్తిడితో పని చేస్తుంటాయి. కొన్ని పరిశ్రమల్లో రియాక్టర్లు శిథిలావస్థకు చేరినా వాటినే వినియోగిస్తున్నారు. దాంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

ఇవి పాటించాలి

- పరిశ్రమల్లో కార్మికులు తప్పని సరిగా పెద్ద బూట్లు, హెల్మెట్, చేతి తొడుగులు వేసుకోవాలి. ఏ పరిశ్రమలోనూ వీటిని వాడటం లేదు.
- ప్రతి పరిశ్రమలో ఒక సేఫ్టీ అధికారి ఉండాలి. ఎక్కడా కనిపించటం లేదు.
- ఆసుపత్రి, అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలి. ఒక్కచోటా లేవు.
- అగ్నిమాపకశాఖ అధికారులు తరచూ పరిశ్రమలను తనిఖీ చేసి ఈ ఏర్పాట్లు పర్యవేక్షించాల్సి ఉన్నా నామమాత్రంగా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

మంచాన పడిన కార్మికుడు



బిహార్ రాష్ట్రం కేతల్‌పూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ స్థానిక శ్యామ్ ఫెర్రస్ అలైస్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. 2020లో చోటు చేసుకొన్న ప్రమాదంలో పరిశ్రమలో పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. యాజమాన్యం ఇతన్ని వెంటనే బెంగళూరు ఆసుపత్రికి తరలించి, దాదాపు రూ.24 లక్షలు వైద్యానికి వెచ్చించారు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. నాలుగేళ్ల నుంచి మంచానికే పరిమితమై జీవశ్ఛవంలా బతుకీడుస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

శ్రీసత్యసాయి జిల్లాలో రెడ్‌జోన్ పరిధిలో 50 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో తప్పని సరిగా భద్రతా ప్రమాణాలు పాటించేలా యజమానులకు తరచూ ఆదేశిస్తున్నాం. పరిశ్రమలనూ తనిఖీ చేస్తున్నాం. భద్రత పాటించని వాటిపై చర్యలు తీసుకొంటాం.

- కేశవులు, పరిశ్రమల ఇన్‌స్పెక్టర్, అనంతపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: గుడిబండ మండలం కురుబరపల్లి, ఎంఎస్ తండా వరకు బీటీ రోడ్డు నిర్మించాలి. - గ్రామస్థులు

సమాధానం: ప్రతిపాదనలు పంపుతాం. **- రామారావు, ఎంపీడీఓ**

– న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: మడకశిర మండలం హెచ్‌ఆర్‌పాళ్యంలోని ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫీజులు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి, సరిచేయాలి. **- ఈరన్న**

సమాధానం: బాక్సు పెట్టి సరి చేస్తాం. **- మహేశ్, లైన్‌మెన్**

– న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

సమస్య పరిష్కారం: అగళి: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలపై ఈనాడు లో ప్రచురించగా బాధ్యులు స్పందించారు. నందరాజనపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పైప్‌లైన్ లీకేజీతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సర్పంచి లక్ష్మమ్మ మరమ్మతులు చేపట్టారు.

స్పందనకు వందనం

పట్టు రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశమైన తెదేపా నాయకులు, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టు రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి, నూతన పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణానికి ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారని నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక పట్టుగూళ్ల మార్కెట్‌లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి, పట్టు రైతులు, రీలర్లతో సమావేశమై చర్చించారు. నూతన మార్కెట్ భవనం, పట్టు రైతులు, రీలర్లకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, నాయకులు నాగరాజు, అమర్‌నాథ్, బేవనహళ్లి ఆనంద్, బాబాఫకృద్దీన్, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సోమందేపల్లి: సరస్వతి మండల సమాఖ్య (వెలుగు) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆ సమాఖ్య అధ్యక్షురాలు హరిత, కార్యదర్శి గగనమ్మ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24వ సంవత్సరం వార్షిక నివేదికను కార్యదర్శి సమర్పించగా చర్చించి, ఆమోదించారు. వచ్చే ఏడాదికి ప్రణాళిక, బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. అనంతరం మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా నిర్మల(బ్రాహ్మణపల్లి), ఉపాధ్యక్షురాలుగా సుజాత(జూలుకుంట), కార్యదర్శిగా సంధ్య (మాగేచెరువు), కోశాధికారిగా ఉష(చాలకూరు), సంయుక్త కార్యదర్శిగా సునీత (నలగొండ్రాయనపల్లి)ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మహాసభలో స్త్రీనిధి మేనేజర్ పద్మావతి, ఏపీఎం రామాంజనేయులు, ఎమ్ఎస్‌పీ గంగరత్న, పలువురు సీసీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా పీసీపీ ఎన్‌డీటీ చట్టం అమలు చేయాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రీ కాన్సెప్షన్, ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీ ఎన్‌డీటీ) చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు పరచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మంజువాణి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఆర్‌కే ప్రైవేట్ నర్సింగ్‌హోంను ఆమె తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో లోపాలు వెలుగు చూడటంతో నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఆతర్వాత వీడీ రోడ్‌లోని స్నేహ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు వెల్లడికావటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్ మీడియా అధికారి బాబాఫకృద్దీన్ ద్వారా ల్యాబ్ నిర్వాహకుడికి నోటీసులు అందించారు. జిల్లాలో ల్యాబరేటరీలు, డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు, మల్టిస్పెషల్ ఆసుపత్రులు తప్పని సరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీల వైద్యులతో సమావేశమై కేటాయించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పద్మజ, షిఫసుల్తానా, నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, కిరణ్మయి, మంజుశ్రీ, సమన్వయకర్తలు ముస్తఫా, రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: మంత్రి

విట్టాపల్లి(పరిగి), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవారం ఆమె మండలంలోని బోరెడ్డిపల్లి, విట్టాపల్లి, పైడేటి, గణపతిపల్లి, శీగుపల్లి గ్రామాల్లో పర్యటించారు. పరిగి పంచాయతీ పరిధిలోని బోరెడ్డిపల్లి నుంచి కొడికొండ శిర జాతీయ రహదారి వరకు రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. విట్టాపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావేదికలో వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించారు. బోరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని ప్రజలు మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మమ్మ, బాలాజీ, కన్వీనర్ గోవింద రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యనారాయణ, నంజుండప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, మహేశ్, హనుమయ్య, ఈశ్వరప్ప వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బోరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న మంత్రి సవిత

మంత్రి దృష్టికి సీహెచ్‌సీ సమస్యలు

గోరంట్ల: గోరంట్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను బుధవారం వైద్యాధికారి వినోద్‌కుమార్, సిబ్బంది ఆధ్వర్యంలో మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు, సిబ్బందిని నియమించాలని, నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రిని సన్మానించారు.

సిద్దేశ్వరాలయంలో భక్తులకు వసతులు కల్పించండి

అమరాపురం, న్యూస్‌టుడే: హేమావతి సిద్దేశ్వరాలయంలో భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లను సత్వరమే నిర్మించాలని తెదేపా తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, టీఎన్‌టీయూసీ తాలూకా అధ్యక్షుడు గొల్లమారనపల్లి రామచంద్ర కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు బుధవారం ఆలయాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. టూరిజమ్ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న ట్యాంకును పరిశీలించి మరుగుదొడ్లు, స్నానపు గదులకు నీరు అందించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్, ఎంపీటీసీ సభ్యుడు ఓంకార్‌స్వామి, నాయకులు ఓబుళరాజు, ప్రభాకర్, రంగస్వామి, కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని బూదిపల్లిలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే బోరు తవ్వించారు. అందులో నీరు పుష్కలంగా లభ్యమయ్యాయి. మాజీ సర్పంచి శ్రీనాథ్, నాయకులు జయరామ్, నరసింహమూర్తి, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండకు చెందిన జిక్రియాసాబ్ కుమార్తె ఆలియా(8) డెంగి లక్షణాలతో బుధవారం మృతి చెందింది. చిన్నారి గుడిబండ ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదివేది. వారం రోజుల నుంచి జ్వరం వచ్చింది. మడకశిర, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైకాపాలో లుకలుకలు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా మాజీ మంత్రి శంకరనారాయణను నియమించే విషయంలో ఆ పార్టీలో వర్గపోరు మొదలైంది. బుధవారం స్థానిక ఓ ద్విచక్ర వాహనాల షోరూంలో వైకాపా నాయకుడు రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉష వ్యతిరేక వర్గం నాయకులు సమావేశం నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా ఉషను తొలగించి, శంకరనారాయణను తిరిగి నియమించుకునేందుకు పార్టీ నాయకులందరూ జగన్‌ను కలిసి తమ అభిప్రాయం తెలపాలని నిర్ణయించారు. దీంతో మరోసారి వర్గపోరుకు తెరలేచినట్లయ్యింది. సమావేశంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు : ఎమ్మెల్యే

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే మార్చి తరువాత నియోజకవర్గంలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తెదేపా తీసుకుంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. మండలంలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో ఏడేళ్లుగా బాత్‌రూంలో నివాసముంటున్న నరసింహప్ప కుటుంబానికి కొత్త ఇంట్లి నిర్మాణానికి బుధవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఇంటి మంజూరు పత్రం అందజేశారు. ఎంపీపీ కవిత, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డా.శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్, ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 గోడ పత్రాలు విడుదల చేశారు.

‘కూటమి ప్రభుత్వం హామీలు నెరవేరుస్తోంది’

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని తెదేపా పట్టణాధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం విజయవంతంగా వందరోజుల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా పాండురంగనగర్ ఎన్టీఆర్ పార్కులోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో పాండురంగనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగకుమార్, తెదేపా నాయకుడు జయసింహ, మాజీ కౌన్సిలర్ శశికళ, భాజపా నాయకులు ఆదర్శకుమార్, నాయకులు అమర్‌నాథ్, మురళి, మల్లికార్జున, వెంకటేశ్, నాగార్జున, అశ్వర్థమ్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.




ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేదెన్నడో?



అమరాపురం మండలంలోని ఆలదపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎనిమిదేళ్ల కిందట అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వం పనుల పూర్తికి చర్యలు చేపట్టలేదు. ఆరు నెలల కిందట కంకర లారీ భవనానికి ఢీకొనడంతో బీటలు వారింది. దీనిపై ఎంపీడీవో భాస్కర్‌ను వివరణ కోరగా ఐసీడీఎస్ ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, అమరాపురం**

అకాల వర్షం.. తడిసిన రాగికంకులు



సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు కూడలిలో 44వ జాతీయ రహదారి పక్కన బుధవారం గుడిపల్లి గ్రామానికి చెందిన సుబ్బన్న అనే రైతు రాగి కంకులు ఎండబెట్టారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో అకస్మాత్తుగా వర్షం కురవడంతో కంకులు పూర్తిగా తడిపోయాయి. రాగులు నీళ్లలో తేలిపోయాయి. పంట నష్టపోయిన రైతు బాధ వర్ణనాతీతం. వర్షంలో కంకులు కుప్ప చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. **- న్యూస్‌టుడే, పెనుకొండ పట్టణం**

13 మందిపై కేసు

రొద్దం: కోగిర గ్రామంలో ఆస్తి విషయమై ఇటీవల నర్సారెడ్డి వర్గం, భాస్కరరెడ్డి వర్గం గొడవపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీ, కారు ఢీ

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పులగూర్లపల్లి సమీపంలోజాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కంటైనర్ లారీని వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బెంగళూరులోని కేఆర్ పురానికి చెందిన వెంకటరమణ, నాగరాజు, మరో చిన్నారి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం బాగేపల్లికి తరలించారు. గుంతకల్లులోని బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తొమ్మిది మంది ఒకే వాహనంలో తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవోలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ తెలిపారు. బుధవారం జనవిజ్ఞన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ముద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి రామకృష్ణ మాట్లాడుతూ లేపాక్షి, పరిగి, చిలమత్తూరు, హిందూపురం మండలాల్లోని 44 పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించగా 3,800 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలు.. సమస్యల లోగిళ్లు

కాలనీ | జనాభా | సమస్య

కనీస సౌకర్యాలు లేక ప్రజల అవస్థ



సి.రంగాపురం ఇందిరమ్మ కాలనీలో పెరిగిన కంపచెట్లు

మడకశిర గ్రామీణం, గుడిబండ, అమరాపురం, న్యూస్‌టుడే: మడకశిర నియోజకవర్గంలోని ఇందిరమ్మ కాలనీల్లో సమస్యలు తిష్ఠవేశాయి. కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. ఆ కాలనీల్లో 50వేల మందికిపైగా జనాభా ఉన్నారు. సుమారు 300 కాలనీలకుగాను 180 చోట్ల సీసీ రోడ్డు లేవు. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కొండలు, గుట్టలకు ఆనుకుని ఉన్న కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది. చీకటి పడితే వన్యప్రాణుల సంచారంతో బెంబేలెత్తిపోతున్నారు.

- ● : మడకశిర యు.రంగాపురం
- ● : 400కు పైగా
- ● : మట్టి రోడ్లపై గుంతలు పడ్డాయి. కంపచెట్లు పెరిగాయి.

- ● : చందకచర్ల పంచాయతీ కొత్తలం
- ● : సుమారు 100 మంది
- ● : విద్యుత్తు స్తంభాలు, దీపాలు లేవు.

- ● : సి.రంగాపురం
- ● : 150 మంది
- ● : వర్షం జలమయమవుతుంది.

- ● : గుడిబండ మండలం మద్దనకుంట
- ● : 200 మంది
- ● : సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, నీటి సౌకర్యం లేదు. చెత్తాచెదారం పేరుకుపోయింది.

- ● : అమరాపురం మండలం హెచ్‌బీఎన్ కాలనీ
- ● : 120 మంది
- ● : 150 ఇళ్లు మంజూరు కాగా 30 మంది నిర్మించుకున్నారు. కంప చెట్లు పెరిగాయి.

- ● : అగళి మండలం పి.బ్యాడిగెర
- ● : 150 మంది
- ● : రోడ్డు సౌకర్యం లేదు. పొలాల వెంబడి రాకపోకలు సాగిస్తున్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి



వర్షం వస్తే వీధులు జలమయం అవుతున్నాయి. రోడ్లపై బురద పేరుకుపోతుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సత్వరమే సీసీ రోడ్లు వేయాలి.

- జిలకమ్మ, సి.రంగాపురం, మడకశిర మండలం

వసతులు కల్పించాలి



మట్టిదారులు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. రాత్రివేళ నడవాలంటే ఇబ్బందిగా ఉంది. కంప చెట్లు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. దోమల బెడద అధికంగా ఉంది. సౌకర్యాలు కల్పించాలి.

- నరసింహమూర్తి, మద్దనకుంట, గుడిబండ

ప్రతిపాదనలు పంపాం

నియోజకవర్గ వ్యాప్తంగా 62 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. కాలనీల్లో వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

- సోనిబాయి, రామారావు, ఎంపీడీఓలు, మడకశిర, గుడిబండ

అలరించిన సంగీత విభావరి

కొడిగెనహళ్లి(పరిగి): ఎస్.పి బాలసుబ్రమణ్యం వర్ధంతి పురస్కరించుకొని బుధవారం కొడిగెనహళ్లి గురుకుల ఎక్స్‌లెన్స్ పాఠశాలలో సంగీత విభావరి నిర్వహించారు. బాలు స్వర నీరాజన బృందం అధ్యక్షుడు రామలింగప్ప ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలతో పాటు మెలోడీ పాటలు పాడి సభికులను అలరించారు. భరత నాట్యకళాకారిణి హన్సిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.వి.మురళీధర్‌బాబు, బృందం సభ్యులు రామలింగయ్య, అశ్వర్థప్ప, శంకరప్ప, నాగరాజు, హిందూపురం ఎంఈవో గంగప్ప, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



పరిగి: పాటలు పాడుతున్న ఎంఈవో గంగప్ప

హిందూపురం సాంస్కృతికం: పట్టణంలోని నానెప్పనగర్‌లో ఉన్న కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి శ్రీకంఠపురం మంచు మ్యూజిక్ మెలోడీస్ నిర్వాహకుడు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతి నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక నుంచి విచ్చేసిన గాయకులు బాలసుబ్రమణ్యం పాడిన గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మహేశ్‌కుమార్‌కు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.



హిందూపురంలో..

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

తాగునీరు వృథా



నీటి ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం యర్రదొడ్డి కాలనీలో ఉన్న పంచాయతీ తాగు నీటి ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. పంచాయతీ మోటారు నుంచి వచ్చే నీరు ట్యాంకు నిండి నిరంతరం వృథా అవుతోంది. దీంతో ట్యాంకు, పరిసరాలు పాచి పడుతున్నాయి. ట్యాంకుకు అమర్చిన కుళాయి కూడా విరిగిపోవడంతో నీరు లీకేజీ అవుతోంది. విరిగిన కుళాయి స్థానంతో చెక్క ముక్కను అడ్డుగా పెట్టి నీటి వృథా కాకుండా చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి శారద దృష్టికి తీసుకెళ్లగా పాడైన కుళాయి స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సిబ్బందితో ట్యాంకు, పరిసరాలు శుభ్రం చేయిస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో పాఠశాల హెచ్‌ఎం నాగరత్న, పీడీ చామంతి

రామగిరి: మండల పరిధిలోని నసనకోట ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, జయసింహ జాతీయ స్థాయి అండర్ 14 జూడో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ చామంతి తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జయసింహ 25 కేజీల విభాగంలో, కావ్య 40 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించి అక్టోబరు 4 నుంచి 8 వరకూ గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగరత్న, పాఠశాల ఉపాధ్యాయులు పీడీ, క్రీడాకారులను అభినందించారు.

ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌గా తాయన్న

ధర్మవరం: ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌గా తాయన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. కణేకల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న తాయన్నను ధర్మవరానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమణరావు అనంతపురం అర్బన్ సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తాయన్నను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బదిలీపై వెళుతున్న రమణరావును సన్మానించి వీడ్కోలు పలికారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తనకల్లు, న్యూస్‌టుడే: తనకల్లులోని ఎస్సీ కాలనీకి చెందిన కిష్టప్ప అనారోగ్యంతో మరణించడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వారి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. వారి కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. తనకల్లులోని ఇందిరానగర్‌కు చెందిన మునెమ్మ మరణించడంతో వారి కుటుంబానికి రూ. 10 వేలు సాయం అందించారు. ఆ మొత్తాన్ని తెదేపా, జనసేన నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు.

తెదేపా నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

రామగిరి, న్యూస్‌టుడే : ముత్యాలంపల్లికి చెందిన మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు నారాయణప్ప మృతికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంతాపం తెలిపారు. బుధవారం ఆయన మృతదేహానికి తెదేపా జెండా, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నారాయణప్ప కుటుంబానికి తెదేపా, పరిటాల కుటుంబం అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

అంగన్‌వాడీ సహాయకురాలిపై ఫిర్యాదు

కదిరి: నల్లచెరువు మండలంలోని దేవిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న సహాయకురాలు అక్రమంగా నియామకం పొందినట్లు గ్రామస్థులు సీడీపీవోకు ఫిర్యాదు చేశారు. ఆమె హెల్పర్ పోస్టును బోగస్ ధ్రువపత్రాలతో పొందినట్లు ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీడీపీవో గంగరత్నమ్మ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పాతకక్షలతో కత్తితో దాడి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం మదార్‌సాబ్‌వీధికి చెందిన సల్మాన్, గౌస్‌బాషాపై ఇద్దరు కత్తితో దాడిచేసి గాయపరిచారు. బాధితులు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు. సల్మాన్, ముబారక్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని నిందితుడు ముబారక్, సిద్ధిక్ అనే యువకుడితో కలిసి సల్మాన్ ఇంటివద్దకు వచ్చి వాగ్వాదానికి దిగాడు. సల్మాన్ బావ గౌస్‌బాషా వారించేందుకు యత్నించగా రెచ్చిపోయిన ముబారక్ ఇద్దరిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఇద్దర్నీ కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

కూలిపోతే కానీ స్పందించరా?



పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఒరిగిన విద్యుత్తు స్తంభం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం పట్నం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రెండు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే ఈ రహదారిలో నిత్యం వందల మంది విద్యార్థులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీప గ్రామాల నుంచి రోగులు, వివిధ అవసరాల కోసం గ్రామస్థులు ప్రయాణం చేస్తుంటారు. అనుకోని ప్రమాదం జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఈ విషయాన్ని కదిరి గ్రామీణ విద్యుత్తు శాఖ ఏఈ గౌరీ శంకర్ దృష్టికి తీసుకెళ్లగా స్థానిక లైన్‌మెన్‌ను పంపి పరిశీలించి, అవసరమైతే స్తంభాలను మారుస్తామని తెలిపారు.

మలుపుల్లో అతివేగం.. తరచూ ప్రమాదం



• నెత్తురోడుతున్న 42వ జాతీయ రహదారి

ముదిగుబ్బ, బత్తలపల్లి, న్యూస్‌టుడే: అనంతపురం నుంచి చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల నాలుగు వరుసలుగా జాతీయ రహదారిని విస్తరించడంతో వాహన రాకపోకలు భారీగా పెరగడం, అతివేగం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేగంగా రావడం, అదుపు చేయలేకపోవడం, మద్యం మత్తు వంటి కారణాలతో ఎందరో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. మరెందరో క్షతగాత్రులవుతున్నారు. తరచూ ఒకే ప్రాంతాల్లోనే ప్రమాదాలు జరుగుతున్నా వాటిని నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారు.



ముదిగుబ్బలో ఇటీవల ప్రమాదానికి గురైన ఆటో, ద్విచక్ర వాహనం

ప్రమాదాల నివారణపై దృష్టిపెడతాం

ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి నివారణకు చర్యలు తీసుకుంటాం. సూచిక బోర్డులు, వేగనియంత్రికలు ఏర్పాటు చేయిస్తాం. జాతీయ రహదారుల విభాగం అధికారులతో మాట్లాడి వేగనియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- ప్రభాకర్, శ్యామరావు ధర్మవరం, ముదిగుబ్బ గ్రామీణ సీఐలు

ఆ ప్రదేశాల్లోనే అధికం..

అనంతపురంలోని పంగల్ రోడ్డు నుంచి బత్తలపల్లి వరకు నిర్మించిన జాతీయ రహదారి డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు ఎత్తుగా పెరగడంతో ఒకవైపు నుంచి మరోవైపుకి యూటర్న్ తీసుకునే క్రమంలో వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈదులముష్టూరు, రామాపురంపల్లి, లింగారెడ్డిపల్లి క్రాస్‌లలో ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే అప్రోచ్ రోడ్లల్లో గ్రామాల నుంచి వచ్చే వాహనాలు గమనించకుండా వేగంగా వస్తూ ఢీకొంటున్నారు. బత్తలపల్లి, ముదిగుబ్బ బైపాస్‌లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ మితిమీరిన వేగంతో వస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. బత్తలపల్లిలోని అప్రాచెరువు, కోడేకండ్ల, చిత్రావతి బ్రిడ్జి, నల్లబోయినపల్లి ముదిగుబ్బలోని రాళ్లఅనంతపురం, జొన్నలకొత్తపల్లి క్రాస్, సంకేపల్లిక్రాస్, బీఎస్ఎన్ఎల్ టవర్, ఎం.కొత్తపల్లి, నాగారెడ్డిపల్లి బ్రిడ్జి, మలకవేములక్రాస్ దగ్గర రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి.

తొమ్మిది నెలల్లో జరిగిన ప్రమాదాల వివరాలు..

మండలం	ప్రమాదాలు	మృతులు	గాయాలు
బత్తలపల్లి	15	3	12
ముదిగుబ్బ	21	10	20



ప్రమాదాలకు నిలయంగా మారిన బత్తలపల్లి బైపాస్

- ఈనెల 13న బత్తలపల్లిలోని నల్లబోయినపల్లి క్రాస్ దగ్గర అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని పవన్ అక్కడికక్కడే మృతిచెందగా ఈశ్వరయ్య తీవ్రంగా గాయపడ్డాడు.
- గత నెల 30న ముదిగుబ్బలోని బీఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర కదిరికి చెందిన తాహీర్ అనే విద్యార్థి అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంలో వస్తూ టిప్పర్‌ను ఢీకొని చికిత్స పొందుతూ కర్నూలులో చనిపోయాడు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్ర విద్యా పరిశీలకుడు రామ్‌కమల్

ధర్మవరం పట్టణం, బత్తలపల్లి, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది నుంచి విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇంటర్ వరకు విద్యాభ్యాసాన్ని పొడిగిస్తామని రాష్ట్ర విద్యా పరిశీలకుడు రామ్‌కమల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రేగాటిపల్లికి చెందిన, బత్తలపల్లిలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిబాపులే బీసీ వసతి గృహాన్ని, దివ్యాంగుల పాఠశాలను రామ్‌కమల్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కంప్యూటర్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గోపాల్‌నాయక్, కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను బుధవారం కదిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో అంజనప్ప అధ్యక్షతన నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై నివేదికలను చదివి వినిపించారు. మొటుకుపల్లి పంచాయతీ పరిధిలో చేపట్టిన పనుల్లో ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న మహిళకు బిల్లులు చెల్లించడం పట్ల సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కదిరి బ్రాహ్మణ పల్లి పంచాయతీలో ప్రభుత్వ ఉద్యోగి భార్య జాబ్ కార్డులో ఉండటంతో తొలగించాలని అధికారులు ఆదేశించారు. పనుల్లో జరిగిన అవకతవకల్లో రూ.1,38,570 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి పీడీ విజయ్‌ప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి, ఏపీడీ రమేష్‌బాబు, ఇన్‌ఛార్జి ఏపీవో శ్రీధర్ రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ చెన్నకేశవులు, సామాజిక తనిఖీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఆవేశాన్ని నియంత్రించుకునే
శక్తి అవసరం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: క్షణికావేశంలో నేరంచేసి జైలుకు వచ్చిన ఖైదీలు ఇక్కడ ఉన్నసమయంలో ఆవేశాన్ని నియంత్రించుకునే శక్తిని పొందాలని జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి శివప్రసాద్ యాదవ్ సూచించారు. బుధవారం కదిరి సబ్‌జైలులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆవేశంలో నేరానికి పాల్పడి జైలుకు వచ్చినంత మాత్రాన కుంగిపోవద్దన్నారు. ఇక్కడ ఉన్నన్ని రోజులు జైలును పాఠశాలగా భావించాలన్నారు. సేవలపై ఆరాతీశారు. జడ్జి వెంట న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, సిరాజుద్దీన్, సబ్‌జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

నైపుణ్య ప్రదర్శనతో క్రీడల్లో రాణించాలి



కదిరిలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా నైపుణ్యాల ప్రదర్శనతో పోటీల్లో రాణించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. కదిరి బాలుర పాఠశాల మైదానంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పోటీలను ప్రారంభించారు. కబడ్డీలో అండర్-17 విభాగంలో కదిరి, నల్లచెరువు బాలురు, వాలీబాల్‌లో కదిరి బాలురు, తలుపుల బాలికలు, బ్యాడ్మింటన్‌లో కదిరి బాలురు, అండర్-14 విభాగంలో ఖోఖోలో కదిరి బాలురు, బాలికల జట్లు, కబడ్డీలో కదిరి, నల్లచెరువు బాలురు, బాలికలు విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఎంఈఓ చెన్నకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు షఫి, ఏడీఎస్ఎస్ఏపీ కార్యదర్శి సందీప్‌కుమార్, పీడీలు చంద్రనాయక్, రాజు, శంకర్‌నాయక్, రమణ, హరూన్, చిన్నరెడ్డెప్ప, లస్కర్, యశోద, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నియోజక వర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు పలు క్రీడా పోటీలు విద్యాశాఖాధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి రాజేశ్వరి హాజరై పోటీలను ప్రారంభించారు. 100 మీటర్ల బాలికల విభాగంలో పరుగు పందెంలో దస్తగిరి అమ్మ (బత్తలపల్లి, బాలికల ఉన్నత పాఠశాల), శాలిని (జీవానంద పాఠశాల), బాలుర విభాగంలో కృష్ణతేజ (ఎంజేపీ పాఠశాల), విక్రాంత్ (ప్రభుత్వ పాఠశాల) విజేతలుగా నిలిచారు. వీరిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ నాగేంద్ర, కోఆర్డినేటర్ రఘునాథ్‌రావు, రాజశేఖర్‌లు తెలిపారు.

జూడోలో బంగారు పతకాలు



ధర్మవరం పట్టణం: హైజంప్ చేస్తున్న విద్యార్థి

ధర్మవరం పట్టణం: ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరుపతిలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో నియోజకవర్గంలోని పలు పాఠశాల విద్యార్థులు జూడోలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచి బంగారు పతకాలు సాధిస్తున్నారు. బుధవారం అండర్-14 విభాగంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జూడో పోటీలో చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అఫ్జల్ మెహరాజ్ 35 కేజీల విభాగంలో, విక్రాంత్ 40 కేజీల విభాగంలో పోటీ పడి విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

ప్రజాశ్రేయస్సే కూటమి ప్రభుత్వ ఆశయం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాశ్రేయస్సే కూటమి ప్రభుత్వ ఆశయమని, మహిళ సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమల్లోకి తీసుకురానుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నో దురాగతాలకు పాల్పడిందన్నారు. తహసీల్దార్ అనుపమ, ఏవో వెంకటబ్రహ్మ, సర్పంచి లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ మధురిమ, కన్వీనర్ విజయ్‌కుమార్ తెదేపా, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్, వనం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

పండిట్ దీన్‌దయాళ్ జయంతిని ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో భాజపా నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తిప్రదాత, జనసంఘ్, భాజపా మూలపురుషుడిగా కొనిడాయారు. ఆయన బోధించిన సిద్ధాంతాలను అనుసరిస్తామని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రులు, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


– న్యూస్‌టుడే బృందం



కదిరి: నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

స్కౌట్స్, గైడ్స్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

కొత్తచెరువు : పాఠశాలు, కళాశాలల్లో భారత స్కౌట్స్, గైడ్స్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆత్మస్థైర్యం, దేశభక్తి పెంపొందుతాయని డీఈవో మీనాక్షి పేర్కొన్నారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి గిరిధర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదిర్శ నాగరాజుల ఆధ్వర్యంలో జిల్లా శాఖ వార్షిక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. రాష్ట్రంలోనే మొదటి సారి శ్రీసత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన స్కౌట్స్, గైడ్స్ కరదీపికలను ఆవిష్కరించారు. విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, డీటీసీ నాగరాజు గుప్తా, జిల్లా కోశాధికారి ఫణిభూషణ్ రావు, మాజీ కార్యదర్శి సాల్మాన్‌రాజు, సీనియర్ స్కౌట్ మాస్టర్లు వెంకట్రామప్ప, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.



జిల్లా స్కౌట్స్ మాస్టర్లు, గైడ్స్ కెప్టెన్‌లతో డీఈవో మీనాక్షి

తితిదే మాజీ పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలి

తలుపుల, న్యూస్‌టుడే: ఎంతో పవిత్రమైన తిరుపతి తిరుమల దేవస్థానం లడ్డులో కల్తీ నూనెలు వాడి అపవిత్రం చేసి, హిందూ మనోభావాలను దెబ్బతీసిన తితిదే మాజీ పాలకవర్గంపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తెదేపా నాయకులు బుధవారం తలుపుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు బాధ్యులైన అప్పటి ఈవో ధర్మారెడ్డి, పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి చర్యలకు నిరసనగా పోలీస్ స్టేషన్‌లో కొంతసేపు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రాముడు, శంకర, రాజారెడ్డి, జయచంద్ర, ముబారక్, వెంకటేశ్వర్లు, గంగరాజు, చౌడయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీజీ ప్రాజెక్టును కృష్ణాజలాలతో నింపుతాం

తనకల్లు, న్యూస్‌టుడే: కృష్ణాజలాలతో మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టును నింపి రైతులకు అండగా నిలుస్తామని కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బుధవారం బాలసముద్రం పంచాయతీ కొక్కంటిక్రాస్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు గోవిందువారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని వేరుసెనగ పంటను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే ముఖ్యమంత్రి డీఎస్సీపై మొదటి సంతకం చేశారని గుర్తు చేశారు. మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఏడీఏ సత్యనారాయణ, వ్యవసాయాధికారి శ్రీహరినాయక్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దారు శోభసువర్ణమ్మ, తెదేపా మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సహాయ డీఎంకు ఏఈఎఫ్ నాయకుల అభినందనలు

ఆర్టీసీ సహాయ డీఎంగా పెద్దన్న

కదిరి, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ డిపో సహాయ మేనేజరుగా పెద్దన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఎన్నో సేవలు అందించారన్నారు. డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు నాగేంద్రనాథ్, ఆనంద్, మల్లికార్జున, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేష్, బెనర్జీ, శ్రీనాథ్, ఓబులేసు పాల్గొన్నారు.

భాజపా నాయకులపై కేసు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహన డ్రైవర్ రామాంజనేయులు భాజపా నాయకులపై ఫిర్యాదు చేశాడు. ఈ నెల 23న సబ్ జైలు కూడలి వద్ద రహదారిపై తన వాహనాన్ని అడ్డగించి దౌర్జన్యం చేశారని పేర్కొన్నాడు. దీంతో భాజపా నాయకుడు రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరీష్, ప్రవీణ్, పవన్‌కుమార్‌పై 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నిష్పక్షపాతంగా విచారణ: ఎస్పీ

ధర్మవరంలో జరిగిన సంఘటనలపై ఇరువురిపైనా కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ వి.రత్న అన్నారు. బుధవారం ధర్మవరం డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆమె డీఎస్పీ శ్రీనివాసులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ధర్మవరం పట్టణంలో రెండ్రోజుల కిందట ఇరుపార్టీల మధ్య చోటు చేసుకున్న సంఘటనలో నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇరువురిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇకపై ఇటువంటి సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో పోలీసు బలగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు సైతం సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

పఠన సామగ్రి పంపిణీ

కదిరి, న్యూస్‌టుడే: అందుబాటులోని అవకాశాల సద్వినియోగంతో లక్ష్యాలు సాధించుకోగలరని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రంలో 120 మంది టెట్ శిక్షణ పొందుతున్నారు. వీరికి ఎమ్మెల్యే పఠన సామగ్రిని అందజేశారు. తెదేపా ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

భూవివాదంలో ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

కదిరి పట్టణం: పట్టణంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో భూవివాదంలో చోటుచేసుకున్న వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. రెండు కుటుంబాల మధ్య భూమికి సంబంధించిన వ్యవహారంలో ప్రారంభమైన ఘర్షణలో రిజ్వాన్, రిహాన్, షబీనా బేగమ్ గాయపడ్డారు. బాబ్జాన్, ముబారక్, బాబా ఫకృద్దీన్‌తో పాటు మరికొందరు బాధితులపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ముగ్గురు స్థానికుల సాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన రామచంద్ర(78) మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. వివరాలు.. పూలకుంటపల్లికి చెందిన రామచంద్ర అదే గ్రామానికి చెందిన మరోవ్యక్తి పని నిమిత్తం కొట్టువారిపల్లికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా పూలకుంటపల్లి సమీపంలోని మలుపు వద్ద కొక్కంటిక్రాస్ నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు వివరించారు.

చెరువులో మహిళ మృతదేహం

కదిరి పట్టణం: కౌలేపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చీకటిపడటంతో మృతదేహాన్ని వెలికితీయడం సాధ్యం కాలేదు. మృతదేహాన్ని వెలికితీశాక వివరాలు తెలియజేస్తామని కదిరి గ్రామీణ పోలీసులు తెలిపారు.

అన్నదాతా.. సుఖీభవ

- అన్న క్యాంటీన్‌కు ఆదరణ
- బారులు తీరుతున్న ప్రజలు

పని వేళలు

ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు రుచికరమైన భోజనాన్ని అందిస్తారు. కేవలం రూ.5లకే అందిస్తున్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

పుట్టపర్తి, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పేదలు పట్టెడన్నం కోసం ఎవరూ అలమటించకూడదనే ఆశయంతో ఎన్డీఏ కూటమి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్‌కు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ప్రజలు ఎవరూ అలమటించకుండా క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో బారులుదీరుతున్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి కూడలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. రోజువారీ కూలీలు, కార్మికులు, భిక్షగాళ్లు, సామాన్య ప్రజలు జేబులో రూ.15 వేసుకుని బయటకు వస్తే ఉదయం రుచికరమైన టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసి ఆనందగా ఇంటికి చేరుకుంటున్నారు. రోజూ 400 నుంచి 600 మంది అన్నక్యాంటీన్ ద్వారా నామమాత్రం రుసుం రూ.5 చెల్లించి, ఆకలి తీర్చుకుంటున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిరుపేదల కడుపుకొట్టి అన్న క్యాంటీన్లను మూతవేసింది. దీంతో నిరుపేదలు, కూలీలు, కార్మికులు ఐదేళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాణ్యమైన భోజనాన్ని రుచి చూసిన ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నక్యాంటీన్‌కు వచ్చే వారికీ ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

తీరిన ఆకలి బాధ - ఇస్మాయిల్



పట్టెడన్నం కోసం అలమటించకూడదనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రన్న అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి ఆకలి తీరుస్తున్నారు. హోటళ్లకు వెళ్లి అంత డబ్బులు చెల్లించలేక పస్తులతో ఇంటికి వెళ్లేవాడిని. మా లాంటి నిరుపేదలు నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చు. రూ.15 ఉంటే చాలు ఖాళీ కడుపుతో ఇంటికి వెళ్లాల్సిన అవసరం లేదు.

రూ.5కే భోజనం - నిడిమామిడిమ్మ, ఎనుములపల్లి



కడుపునిండా రూ.5లకే భోజనం చేస్తున్నా. ఈ వయస్సులో కష్టపడి సంపాదించిన దాంట్లో సగం భోజనానికే ఖర్చయ్యేది. అన్న క్యాంటీన్ ప్రారంభించడంతో రూ.5లకే పూట కడుపునింపుకొంటున్నా, చాలాసార్లు చేతిలో చిల్లిగవ్వలేక ఆకలితో ఇబ్బందులు పడ్డా. మాలాంటి పేదలకు భోజనం పెట్టడంతో ఆకలి తీరుతోంది.